క్లుప్తంగా

పైపులైన్ గుంత పూడ్చివేత


తవ్విన గుంతను పూడ్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్‌రూరల్: పైపులైన్ లీకేజీ కోసం తవ్విన గుంతను అధికారులు బుధవారం పూడ్చివేశారు. మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో గత పదిరోజుల క్రితం అధికారులు పైపులైన్ లీకేజీ కోసం గుంత తీసి వదిలేయడంతో ప్రమాదకరంగా మారిందని 'తవ్వారు.. మరిచారు' అనే శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీ నిర్వహించి తవ్విన గుంతను మూసివేశారు. దీంతో ఆ కాలనీవాసులు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

నందిగామ: గ్రామాల అభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేయాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో జెడ్పీ నిధులు రూ.5లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నాయకులు రాములు, నర్సింలు, శ్రీకాంత్‌గౌడ్, కృష్ణగౌడ్, సుమన్, జంగయ్య, వెంకట్‌రెడ్డి, లింగం, సురేశ్, దామోదర్ రెడ్డి, ఈశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత


మాట్లాడుతున్న రాజ్‌దేశ్‌పాండే గురుస్వామి

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత చేకూరుతుందని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే గురుస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కనకమామిడి అయ్యప్ప దేవాలయంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో నీ గానమే నా ప్రాణం పాట ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని దేవాలయంలో ఏర్పాటు చేసిన 18 మెట్ల మహా పడి పూజచేశారు. అనంతరం నీ గానమే నా ప్రాణం పాట ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ గౌరవ సలహాదారులు కేశవశర్మ, కిట్టు గురుస్వామి, రాంచందర్, కుంటి వెంకట్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్ చారి, వివిధ గ్రామాల అయ్యప్ప భక్తులు, స్వాములు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్

నందిగామ: నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో బుధవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, నాయకులు కుమార్‌గౌడ్, మంకాల శ్రీశైలం, శివకుమార్, వీరేందర్, సాములయ్య, శ్రీనివాస్, భాస్కర్, యాదయ్య, రవితేజ, గిరి, నర్సింహ, వెంకటాచారి, రాజశేఖర్, నరేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తోల్‌కట్టలో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య, నాయకులు, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బి.సత్యనారాయణ, శ్రీనివాస్‌ముదిరాజ్, తోల్‌కట్ట కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చాకలి శ్రీశైలం, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు, గ్రామస్తులు, నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 250 మందికి వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించారు. వీరిలో 50 మందికి కంటి ఆపరేషన్‌లు, 44 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, మల్లేశ్‌యాదవ్, జమాల్‌ఖాన్, నరేశ్‌యాదవ్, లక్ష్మయ్య, జగన్ రెడ్డి, దర్శన్, కృష్ణ, వెంకటేశ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందని నిధులు.. సాగని పనులు

బేస్‌మెంట్ల వరకే పరిమితమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారుల ఆందోళన
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- నిబంధనల కొర్రీలతో అనాసక్తి


ఏట్లఎర్రవల్లిలో ముగ్గు పోసి వదిలేసిన నిర్మాణం

నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రజాపాలనలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేసింది. కానీ లబ్ధిదారులకు ఇళ్లు మంజూరై రెండునెలలు దాటినా సగానికిపైగా నిర్మాణ పనులు ఇప్పటికీ మొదలుకాలేదు. కొన్ని గ్రామాల్లో బేస్‌మెంట్ వరకు నిర్మాణాలు పూర్తయినా వాటికి ఇంకా బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు ఇచ్చే 5 లక్షలు నాలుగు విడతలుగా ఇవ్వడం, ఇంటి నిర్మాణంలో నిబంధనలతో అర్హులైన వారు కూడా ముందుకు రాకపోవడం గమనార్హం.

బిల్లుల చెల్లింపులే సమస్య

షాబాద్: మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ గ్రామంలో 74 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 7 ఇళ్లు బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేసిన లబ్ధిదారులకు ఇంకా బిల్లులు అందలేదు. 16 మంది లబ్ధిదారులు ముగ్గు పోశారు. మిగిలినవారు ఆర్థిక ఇబ్బందులు, ఇసుక కొరత, మొదటి విడత నిధుల ఆలస్యం వంటి కారణాలతో నిర్మాణం ప్రారంభించలేదు. ఇళ్ల నిర్మాణంలో నాలుగు దశల్లో బిల్లుల చెల్లింపు విధానం కూడా సమస్యగా మారింది. ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలే చాలా మంది నిర్మాణానికి ఆసక్తి చూపకుండా చేస్తున్నాయి.

నిబంధనల కొర్రీలతోనే అనాసక్తి


ఈర్లపల్లిలో బేస్‌మెంట్ వరకు పూర్తయిన నిర్మాణం వద్ద లబ్ధిదారురాలు దుర్గాబాయి

చేవెళ్ల: చేవెళ్ల మండలంలో ఒక్క ఇందిరమ్మ ఇళ్లు పూర్తికాలేదు. బిల్లులు కూడా రాలేదు. మండలంలో మొత్తం 25 గ్రామాలు ఒక మున్సిపాలిటీ ఉంది. పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలో ఎంపిక చేసిన ఈర్లపల్లి గ్రామంలో మొత్తం 34 మంది ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికకాగా.. మొదటి విడతలో 14 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో ప్రస్తుతం ఆరు మంది లబ్ధిదారులు మాత్రమే బేస్‌మెంట్ స్థాయిలో, మరో నలుగురు ముగ్గులు పోసుకొని పనులు చేసేందుకు ముందుకొచ్చారు. మిగతా వారు ఇంకా ముందుకు రావటం లేదు. చేసిన పనులకు రావాల్సిన లక్ష రూపాయల బిల్లులు విడుదల కాలేదు. మండలంలోని ఇతర గ్రామాల్లో సైతం జాబితాలో ఉన్నవారు ముందుకొస్తే నిర్మాణాలు చేసుకోవాలని అధికారులు చెబుతున్నా ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ పథకంలో నిబంధనల కొర్రీలతోనే అనాసక్తి చూపిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు.

నిర్మాణాల్లో పురోగతి



మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఈర్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఇప్పుడిప్పుడు పురోగతి కనిపిస్తోంది. మొదటి విడతగా 14 మందికి ఇళ్లు మంజూరుకాగా, ఇందులో దాదాపు 10 మంది వరకు ముందుకొచ్చారు. ఆరు మంది బేస్‌మెంట్ వరకు పనులు చేసుకున్నారు. వారందరికీ మొదటి విడత బిల్లులు రావాల్సి ఉంది. వారి వివరాలు నమోదు చేసి అధికారులకు పంపించాం. మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా ఇళ్ల స్థలాలు ఉన్నవారు నిర్మాణాలు చేసుకునేందుకు ముందుకురావాలని కోరుతున్నాం.

– హిమబిందు, ఎంపీడీఓ

పైలెట్ ప్రాజెక్టు గ్రామానికే పరిమితం

నందిగామ: ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామానికే పరిమితమైంది. మండలంలోని 19 గ్రామ పంచాయతీలు ఉండగా.. 913 మందిని ఇళ్లకు అర్హులుగా గుర్తించారు. అప్పారెడ్డిగూడ గ్రామాన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ గ్రామంలో 38 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. ఇందులో 10 ఇళ్లు పునాది పనులు చేస్తుండగా, 6 ఇళ్లు బేస్‌మెంట్ వరకు పూర్తిచేశారు. మిగతా 22 ఇళ్ల పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటి వరకు ఏ ఒక్క లబ్ధిదారుడికి బిల్లులు రాలేదు. కేవలం సొంత స్థలాలు ఉన్న వారు మాత్రమే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు.

వృథాగా డబుల్ ఇళ్లు..

మండల కేంద్రమైన నందిగామ శివారులో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు వృథాగా పడి ఉన్నాయి. 4 బ్లాకులలో రూ.6కోట్ల 36 లక్షల వ్యయంతో 120 ఇళ్లు నిర్మించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి లాటరీ ద్వారా గదులను కేటాయించారు. పొజిషన్ ఇవ్వడంలో జాప్యం చేయడంతో అంతలోనే ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులలో అనర్హులు ఉన్నారని, తిరిగి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పడంతో ఆ ప్రక్రియ అక్కడే ఆగిపోయింది.


అప్పారెడ్డిగూడలో బేస్‌మెంట్ వరకు పూర్తయిన నిర్మాణం

ఏళ్ల తరబడి ఎదురుచూపు


షాద్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

షాద్‌నగర్: డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నాయి.. లబ్ధిదారులకు చేయకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో గత ప్రభుత్వం 1,736 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించింది. ఇందుకుగాను 3,800ల మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల ముందు పట్టణంలోని పెన్షనర్ల భవనంలో లబ్ధిదారుల అర్హుల జాబితాను తయారు చేశారు. అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ కొంత మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అనర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారని బీఆర్‌ఎస్ రూపొందించిన జాబితాలపై అభ్యంతరం వ్యక్తం చేసింది. అసలైన లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తామని, డబుల్ బెడ్రూం ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. నేటికీ పంపిణీ పూర్తి కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంజూరైనవి 21..పనులు మొదలైనవి 10


వెంకటాపూర్‌లో కొనసాగుతున్న నిర్మాణం

మొయినాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, మొదటి విడతలో 21 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. కేవలం 10 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో బేస్‌మెంట్ లెవల్ నిర్మాణం జరిగింది ఒక ఇళ్లు మాత్రమే. మిగిలినవి పునాది, పిల్లర్ల దశలో ఉన్నాయి. బేస్‌మెంట్ లెవల్ నిర్మాణం జరిగిన ఇంటికి మొదటి విడత బిల్లు కూడా రాలేదు.

అందరూ నిర్మించుకోవాలని చెబుతున్నాం



మొదటి విడతలో వెంకటాపూర్‌లో 21 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. 10 ఇళ్ల నిర్మాణం కొనసాగుతోంది. మిగిలిన వారిని సైతం ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టాలని చెబుతున్నాం. బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన ఒక ఇంటి వివరాలను ప్రభుత్వానికి పంపించాం. త్వరలోనే వారికి మొదటి విడత బిల్లు వస్తుంది.

– సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

నత్తేనయం


ఎర్వగూడలో బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణం

శంకర్‌పల్లి: ఇందిరమ్మ ఇళ్ల పథకం మండలంలో నత్తనడకన కొనసాగుతోంది. మండలంలోని ఎర్వగూడ గ్రామాన్ని అధికారులు మోడల్ విలేజ్‌గా ఎంపిక చేశారు. ఆ గ్రామంలో మొత్తంగా 12 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా.. 9 మందికి నిర్మాణ అనుమతులు వచ్చాయి. మిగిలిన ముగ్గురు ఇతరాత్ర కారణాలతో ఇందిరమ్మ ఇళ్లను తీసుకోలేదు. అయితే ఈ 9 మందిలో 6 మంది ఇప్పటికే పనులు ప్రారంభించగా.. మిగిలిన ముగ్గురు పనులు ప్రారంభించాల్సి ఉంది. ఈ ఆరుగురిలో రెండు ఇళ్ల నిర్మాణాలు బేస్‌మెంట్ స్థాయికి రాగా.. మరో నాలుగు పునాది స్థాయిలో ఉన్నాయి. ప్రస్తుతం నిర్మాణాలు చేపట్టిన వారికి బిల్లులు రాలేదు. మండలంలో మొత్తం ఇప్పటివరకు సుమారు 2,600పైగా ఇళ్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. దీనిపై గ్రామ స్థాయిలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారిని గుర్తిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే, అర్హులకు అనుమతి పత్రాలు అందించే విధంగా అధికారులు సిద్ధం అవుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం కోసం అర్హులు సొంతింటి కల సాకారం చేసుకునేందుకు ఎదురుచూస్తున్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన


చేవెళ్ల: నిరసన తెలుపుతున్న నాయకులు


షాద్‌నగర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు పేదలకు భారంగా మారుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. మున్సిపాలిటీలో బుధవారం సీపీఐ పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రామస్వామి అధ్యక్షతన ర్యాలీ, నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశంలోని పేద ప్రజలు బతుకులు ఆగమవుతున్నాయని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ పేదప్రజలను ఆగం చేస్తున్నారన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగే వరకు సీపీఐ పార్టీ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, శ్రీనివాస్, సుధీర్, జంగయ్య, నాయకులు అంజయ్య, మంజుల, శివ, లలిత, సుగుణమ్మ, పెంటయ్య, శ్రీకాంత్, యాదగిరి, బాబురావు తదితరులు ఉన్నారు.

ధరలను వెంటనే తగ్గించాలి

కొందుర్గు: పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో కొందుర్గు బస్టాండ్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఆయన ఎంపీఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ధరల పెంపుతో నిరుపేదలపై భారం

షాద్‌నగర్: ధరల పెంపుతో నిరుపేదలపై భారం పడుతుందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ ఆరోపించారు. ఇంధనం, గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ బుధవారం షాద్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు కార్యక్రమంలో నాయకులు కొంకళ్ల చెన్నయ్య, రఘునాయక్, బస్వం, ఇబ్రహీం, కరుణాకర్, వీరేశం, విజయ్‌కుమార్‌రెడ్డి, అందె మోహన్, జమ్రుద్‌ఖాన్, మదన్‌మోహన్‌రెడ్డి, అన్వర్, సందీప్‌గౌడ్, నాగమణి, కృష్ణవేణి, ముబారక్, ఖాదీర్, దిలీప్‌కుమార్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

బీజేపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి

చేవెళ్ల: బీజేపీ ప్రభుత్వం, నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి అధ్యక్షతన మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ.. పార్టీ చేపట్టిన బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని వజయవంతం చేయాలని, ప్రతీ వ్యక్తికి పార్టీ చేస్తున్న సేవలను తెలియజేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

షాద్‌నగర్: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నేతలు తమ సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల సురేశ్ అధ్యక్షతన మండల బూత్ కమిటీలు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు తగిన విధంగా కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకూ తీసుకెళ్లి చైతన్య పరచాలన్నారు. అర్హులైన వారికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించే విధంగా నాయకులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో బీజేపీ జెండాను ఎగురవేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్ గుప్తా, నాయకులు దొడల వెంకటేశ్, ఎంకనోళ్ల వెంకటేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు సత్కారం

షాద్‌నగర్: శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేసినందుకుగాను హిందు వాహిని సంస్థ నాయకులు బుధవారం ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. శోభాయాత్రకు గట్టి బందోబస్తు కల్పించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా శోభాయాత్ర విజయవంతం చేసినందుకు నాయకులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ, సీఐని నాయకులు సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో హిందు వాహిని నాయకులు చెట్ల వెంకటేశ్, గుడాల రమేశ్, మహేశ్, శేఖర్‌గౌడ్, వెంకటేశ్, శివశంకర్, రఘు, శ్రీనాథ్, అజయ్, శ్రీను, భరత్, శివ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పాదయాత్ర

నందిగామ: షాద్‌నగర్ నుంచి యాదగిరిగుట్ట వరకు బీజేపీ నాయకులు చేపట్టిన పాదయాత్ర బుధవారం నందిగామకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలని, ముచ్చటగా మూడోసారి ప్రధానిగా మోదీ కావాలని గతంలో యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహాస్వామికి మొక్కుకున్నామని, అనుకున్న కోరిక నెరవేరడంతో మొక్కులు తీర్చుకునేందుకు పాదయాత్ర చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో హరిభూషన్, కురుమయ్య, శంకర్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్ ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు


స్వామికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరు నర్సిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నర్సిరెడ్డిని ఘనంగా సత్కరించారు.

ఘనంగా స్వామివారి కల్యాణోత్సం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం, హోమం, చక్రాబ్ధి మండల ఆరాధన, గరుడ సేవ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కోట జనార్ధన్, పాలాది శివకుమార్, అంజయ్య, బిజ్జుల గోపాలకృష్ణ, ఏలూరి లింగం తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు


మాట్లాడుతున్న పర్వతాలు

కొత్తూరు: మున్సిపాలిటీలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా బుధవారం కొత్తూరు పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్‌గా విధులు నిర్వహిస్తున్న కార్మికుల పరిస్థితులు దయనీయంగా ఉన్నట్లు వివరించారు. విధుల్లో భాగంగా రోడ్డు ప్రమాదాలకు గురైతే అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వారందరికీ వారంతపు సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాలు జీఓలు తెస్తున్న అమలుకావడం లేదని విమర్శించారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరారు. ఈ నెల 12న నిర్వహిస్తున్న జిల్లా మహాసభలో మున్సిపల్ కార్మికుల సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, సంజీవ, జంగయ్య, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.